సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 31-8-2024

సంపుటి: 20 సంచిక: 136

పేజీలు: 4 వెల: రూ.1

## కళింగపట్నంలో అర్థరాత్రి తీరం దాటుతుంది.. అప్రమత్తంగా ఉండండి!

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉండడంతో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. కళింగపట్నం వద్ద అల్పపీడనం తీరం దాటే అవకాశం ఉందని ఏపీ విపత్తుల సంస్థ తెలిపినందున మరింత జాగ్రత్తగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు శిథిలమైన, పాత ఇళ్లలో ఉండవద్దని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూచించారు. అదే విధంగా చెరువుల్లో, వాగుల్లో, కాలువల్లో నీరు అధికంగా చేరడంతో స్నానాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అలాగే పిడుగులు పడే అవకాశం ఉన్నందున పశువుల కాపర్లు జాగ్రత్త ఉండాలని వివరించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్ల వద్దని స్పష్టం చేశారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కాలువల్లో చెత్తాచెదారం నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.



- -అనుమతి లేని ఆకులతంపర నుంచి ఇసుక తరలింపు
- -ఒడిశా బిల్లులతో అక్రమార్కుల మాయాజాలం
- -గ్రామస్తులను ముందుపెట్టి అడ్డుకున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు
- -ఎమ్మెల్యే టార్గెట్‌గానే ఈ పని చేయించారని సమాచారం
- -ఎంజీఆర్, కలమట మధ్య ఉన్న విభేదాలతో ఇసుక దందా వెలుగులోకి

### గ్రూపుల గుద్దులాట..


# టీడీపీలో ఇసుకాట!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు తనకు అండగా నిలిచిన టీడీపీ కార్యకర్తలకు మూడు వరాలిచ్చారు. అవేంటంటే.. ఇసుకను తరలించుకోవడం, నీరు-చెట్టుకు సంబంధించి రూ.240 కోట్ల పాత బిల్లులు రిలీజ్ చేయడం, మద్యం షాపులకు టెండర్లు నిర్వహించి వారికి అప్పగించడం. ఒక్కో లిక్కర్ షాపు వల్ల కనీసం పది మంది కార్యకర్తలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. గత ప్రభుత్వంలో బడాబాబులే ఇసుక తవ్వకాలు నిర్వహించారు. ఈసారి కూడా అదే మాదిరిగా ఇసుకను తరలించుకుపోవాలని చూస్తున్న స్థానిక టీడీపీ నేతలకు ఆ పార్టీ నేతలే అడ్డుగా నిలవడం గమనార్హం. ఎన్నికల సమయంలో జిల్లా టీడీపీలో గ్రూపుల వ్యవహారం బయటపడింది. సొమ్ము ఖర్చు చేసే వారికి టిక్కెటివ్వడం ద్వారా టీడీపీ కొందరిని పక్కన పెట్టింది. దీన్ని మనసులో పెట్టుకుని ఆ పార్టీ పాతకాపులు ప్రస్తుత నేతల ఇసుక దందాలను అడ్డుకుంటున్నారు. ఇది సంతోషించదగ్గ పరిణామమే. ప్రతిపక్షంలో ఉన్న వైకాపా నేతలు చేయాల్సిన పనిని ఎక్కడికక్కడ టీడీపీ నేతలే చేస్తున్నారు. తాజాగా పాతపట్నంలో అనుమతులు లేని ర్యాంపు నుంచి తరలిపోతున్న ఇసుకను స్వయంగా జిల్లా పార్టీ - మిగతా 4లో



ఒడిశా ప్రభుత్వం ఇచ్చిన ట్రాన్స్‌మిట్ పాస్ ఇదే



- -అత్యవసరం పేరుతో నామినేషన్ దందా
- -టెండర్ ప్రక్రియ పూర్తికాకుండానే పనులు
- -అమరావతి పేరుతో తాడేపల్లిగూడెం కాంట్రాక్టర్ హల్‌చల్
- -అరకొరగా ఉన్న కార్పొరేషన్ ఆదాయం నుంచి చెల్లింపులు
- -ఇప్పటికే చెక్కు రూపంలో రూ.25 లక్షల చెల్లింపు

### రంగుల హంగుల్లో..



# అవినీతి 'చిత్రాలు!

అత్యవసర పనులు అంటే ఏమిటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రతి మనిషి జీవితంలోనూ ఇలాంటి అత్యవసర సందర్భాలు కోకొల్లలు. అలాగే అత్యవసరంగా పనులు చేపట్టడమంటే వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు టెండర్ల ఖరారు వరకు వేచిచూడకుండా సహాయ, పునరావాస పనులు చేపట్టడం, అందుబాటులో ఉన్నవారికి ఒక్కో పని అప్పగించి యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ కార్యక్రమాలు జరిపి వెంటనే బిల్లులు చెల్లించడం ఎక్కడైనా జరిగేదే. కానీ గోడలకు సున్నాలేయడం, రంగులద్దడం కూడా అత్యవసర పనేనట! టెండర్లు పిలవడం, ఖరారు చేయడం వంటి ప్రక్రియలతో సంబంధం లేకుండానే యుద్ధప్రాతిపదికన ఈ పనులు చేపడుతున్నారు. దీనికి ఆగస్టు 15 వేడుకలకు జిల్లా కేంద్రాన్ని ముస్తాబు చేయాలన్న సాకు చూపారు. పోనీ 15వ తేదీలోగా ఈ పని పూర్తికావాలేమో, అందుకే అర్జంటు వర్క్‌గా చూపించారనుకుంటే పొరబడినట్టే. ఎందుకంటే.. ఇప్పటికీ గోడ మీద బొమ్మలేసే కార్యక్రమం కొనసాగుతునే ఉంది. అదే సమయంలో ప్రభుత్వ పోర్టల్‌లో ఇందుకు సంబంధించిన ఈ-టెండర్ ఓపెన్ చేసే ఉంది. దీనికి గడువు తేదీ కూడా ఇంకా ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తికాక ముందే ఈ పనులు జరుగుతున్నాయంటే ఒకటే గుర్తుకొస్తోంది. అదే రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా... వడ్డించేవాడు మనవాడైతే ఏ మూలనున్నా అన్ని రకాలు ఆకులో పడతాయనే విషయం. అమరావతి వర్గాలు అక్కడే ఒక కాంట్రాక్టర్‌ను సిద్ధం చేశాయి. ఆయనకే టెండర్లు, అగ్రిమెంట్లు లాంటి ప్రక్రియలు లేకుండా పనులు చేపట్టే విధంగా అన్ని ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి.

వివరాలు 4లో





• ఎడిటోరియల్

# నిన్న బంగ్లాదేశ్.. నేడు బెంగాల్!


కొన్ని ఘటనలు యాదృచ్ఛికంగా జరుగుతుంటాయి. ఎటువంటి సంబంధం లేకపోయినా, కారణాలు ఒకటి కాకపోయినా రెండు ప్రాంతాల్లో లేదా రెండు సందర్భాల్లో దాదాపు ఒకేలాంటి పరిణామాలు సంభవిస్తుంటాయి. గత కొద్దిరోజులుగా పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న అల్లర్లు, ఇతర ఘటనలు పరిశీలిస్తే.. దానికి నెలా రెండు నెలల ముందు మన పొరుగు దేశం.. ఇంకా చెప్పాలంటే పశ్చిమ బెంగాల్‌కు అనుకునే ఉన్న బంగ్లాదేశ్‌లోనూ దాదాపు ఇటువంటి దురదృష్టకర సంఘటనలే చోటుచేసుకున్నాయి. ఈ రెండుచోట్ల సంభవించిన పరిణామాలకు కారణాలు మాత్రం పూర్తిగా భిన్నమైనవి కావడం విశేషం. ఇంకా విచిత్రం ఏమిటంటే బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్ ఒకప్పుడు వంగదేశం పేరుతో కలిసే ఉండేవి. అఖండ భారతదేశంలోని తూర్పు ప్రాంతంలో వంగ దేశం కీలకమైనది. బెంగాలీ మాతృభాష కలిగినవారు అధిక సంఖ్యలో ఉండటం వల్ల దాన్ని బంగ లేదా వంగ దేశం అనేవారు. కాలక్రమంలో అది బెంగాల్‌గా మారింది. దేశ విభజన సమయంలో తూర్పు బెంగాల్ పాకిస్థాన్‌లో కలిసిపోగా మిగిలిన వంగ దేశం పశ్చిమ బెంగాల్ పేరుతో భారతదేశంలో ఒక అగ్రగామి రాష్ట్రంగా కొనసాగుతోంది. తూర్పు, ఈశాన్య భారత ప్రాంతాల్లో కీలక రాష్ట్రంగా ఉంది. తర్వాత కాలంలో తూర్పు బెంగాల్ ప్రాంతీయుల భారత సైన్యం సహాయంతో పాకిస్థాన్‌పై పోరాటం చేసి ప్రత్యేక దేశం సాధించుకున్నారు. అదే బంగ్లాదేశ్. బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా అవతరించినా, పశ్చిమ బెంగాల్ భారత్‌లో ఒక రాష్ట్రంగా ఉన్నా.. ఈ రెండింటిలో నివసించే ప్రజల సామాజిక, సాంస్కృతిక విధానాలు ఒకేలా ఉంటాయి. రెండింటి మధ్య సంబంధ బాంధవ్యాలు కూడా ఎక్కువే. అటువంటి ఈ రెండూ ఒకదాని తర్వాత ఒకటిగా అల్లర్లతోనూ, రాజకీయ ఉద్యమాలతోనూ అట్టుడుకుతూ పాలకులపై తిరుగుబాటు చేసే స్థాయికి వెళ్లడం యాదృచ్ఛికమే. బంగ్లాదేశ్‌లో నిన్న మొన్నటి వరకు అధికారంలో ఉన్న షేక్ హసీనా నేతృత్వంలోని అవామీలీగ్ ప్రభుత్వంపై విద్యార్థులు లేవనెత్తిన తిరుగుబాటు చివరికి ఆమె పదవీచ్యుతికి, దేశం విడిచి పారిపోవడానికి దారితీశాయి. కాగా గత పాతిక రోజులుగా ఇక్కడ పశ్చిమ బెంగాల్‌లోనూ విద్యార్థులే ఉద్యమించి రాష్ట్రాన్ని రణరంగంగా మార్చారు. ఇప్పుడు వారు బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని పదవికి రాజీనామా చేసి.. రాష్ట్రం విడిచి వెళ్లిపోవాలని డిమాండ్ చేస్తుండటం విశేషం. బంగ్లాదేశ్‌లో బంగ్లాదేశ్ ఛాత్ర పరిషత్ ఆధ్వర్యంలో ఉద్యమాలు జరగ్గా.. ఇక్కడ బెంగాల్‌లో పశ్చిమ బంగ ఛాత్ర సమాజ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు జరుగుతున్నాయి. అయితే రెండు ప్రాంతాల్లో జరిగిన, జరుగుతున్న ఉద్యమాలకు కారణాలు మాత్రం ఏమాత్రం సంబంధం లేనివి. 1971 నాటి బంగ్లా విముక్తి పోరాటంలో పాల్గొన్న యోధుల కుటుంబాల పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో పెద్ద ఎత్తున రిజర్వేషన్లు కల్పిస్తూ షేక్ హసీనా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఇతర వర్గాల్లో అసంతృప్తికి, ఆగ్రహానికి కారణమైంది. ఆ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ విద్యార్థి, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా రోడ్లపైకి వచ్చి హర్తాళ్లు, బంద్‌లు నిర్వహించారు. దీని వెనుక ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రమేయం కూడా ఉండటంతో ఉద్యమం రాజకీయ రూపు దాల్చి అదుపుతప్పింది. దాడులు, హింస, విధ్వంసం ప్రజ్వరిల్లాయి. వాటిని అదుపు చేయడంలో పోలీసులు విఫలం కావడంతో సైన్యం దేశాన్ని తన చేతుల్లోకి తీసుకుంది. అయినా శాంతించని ఉద్యమకారులు ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేస్తూ ఆమె అధికారిక నివాసంపై దాడి చేసి విధ్వంసం సృష్టించడంతో ఆమె పదవిని త్యజించి కుటుంబంతో సహా ఉన్న ఫళంగా దేశం విడిచి వెళ్లిపోయారు. అక్కడికి కొద్దిరోజుల వ్యవధిలోనే బంగ్లాదేశ్‌కు దాయాదిగా చెప్పే పశ్చిమ బెంగాల్‌లోనూ విద్యార్థి ఉద్యమమే చెలరేగి ఆ రాష్ట్రాన్ని అట్టుడికిస్తోంది. కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో ఈ నెల ఎనిమిదో తేదీ అర్ధరాత్రి విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై జరిగిన దారుణ అత్యాచారం, హత్య ఘటన బెంగాల్‌తో పాటు యావత్తు దేశాన్ని కుదిపివేసింది. దిగ్భ్రాంతికరమైన ఈ ఘటన విషయంలో బెంగాల్‌లోని మమతా బెనర్జీ సర్కారు స్పందించిన తీరు ఆమె ప్రభుత్వ పాత్ర, నిబద్ధతపై అనుమానాలు రేపింది. ఈ ఘటనను మొదట ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు జరగడం అన్ని వర్గాల్లోనూ ఆగ్రహావేశాలు రగిలించింది. ఈ దారుణ ఘటనలో పాత్ర ఉందని అరోపణలు ఎదుర్కొంటున్న వైద్య కళాశాల ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌పై చర్యల పేరుతో మమత సర్కారు ప్రిన్సిపల్ పదవి నుంచి తప్పించినట్లే తప్పించి వెంటనే వేరే వైద్య కళాశాలకు పోస్టింగ్ ఇవ్వడం, సంఘటనపై దాదాపు ఒకరోజు తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వంటి అంశాలు మమత సర్కారును సమాజం ముందు దోషిగా నిలబెట్టాయి. ఈ ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ చేపట్టడం, కేసు దర్యాప్తు బాధ్యతను సీబీఐకి అప్పగించినప్పటికీ ఇప్పటికీ పెద్దగా పురోగతి కనిపించడంలేదు. దాంతో ఆ రాష్ట్రంలోని విద్యార్థిలోకం తీవ్రంగా స్పందించింది. ఛాత్ర సమాజ్ పిలుపుమేరకు కోల్‌కతా, హౌరా సహా అనేక ప్రధాన నగరాలు, పట్టణాల్లో లక్షలాది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని, తక్షణమే రాష్ట్రం విడిచిపెట్టి వెళ్లిపోవాలన్న డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. ఈ ఆందోళనలను భగ్నం చేసేందుకు పోలీసులు చాలా ప్రాంతాల్లో విద్యార్థులపై లాఠీచార్జీ చేశారు. భాష్పవాయు గోళాలు ప్రయోగించారు. సరిగ్గా ఇదే సమయంలో బీజేపీ రాష్ట్ర బంద్ నిర్వహించడంతో రాజకీయ కార్యకర్తలు కూడా విద్యార్థుల ముసుగులో రెచ్చిపోయారని తెలుస్తోంది. ఈ పరిణామాలతో షేక్‌హసీనా మాదిరిగానే మమత సర్కారు కూడా కూలిపోవచ్చన్న ప్రచారం జరుగుతోంది.

# గెలుపు సరే.. బతకడం ఎలా?

గెలుపు సరే.. బతకం ఎలా? అనే ఒక ప్రశ్నతో పతంజలి మార్కు తార్కిక వ్యంగ్య వైభవంతో గెలుపు సూత్రాలను కాకుండా బతుకు సూత్రాలను రచించారు. ఈ ప్రపంచం మొత్తాన్ని అనేక రకాల గురువులు ఆక్రమించివున్నారు. కుల, మత, సాంస్కృతిక, రాజకీయ, కార్పొరేట్ గురువుల చేతుల్లో పడి సామాజిక కూర్పు అంతా అస్తవ్యస్తమైపోతున్న తరుణంలో గెలుపే జీవితంగా, ఓటమి మరణంగా భావింపబడుతున్న దశలో పతంజలి ఒక భిన్నమైన కోణం నుంచి జీవితాన్ని చూపించిన పుస్తకమిది. అందులో కొన్ని మచ్చుతునకలు 'సత్యం' పాఠకుల కోసం.

## యుద్ధాలక్కర్లే.. వ్యాపారం చేయండి

'కార్ల్ మార్క్స్ అనే ఆసామి ఈ అదనపు విలువ గురించి అందరికీ చెప్పకముందే అదొకటి వుందని, అది చాలా లాభదాయకంగా ఉందనీ పెట్టుబడిదారులు కనిపెట్టారు. జీవహింస అనేది చాలా తప్పయ్యా, యుద్ధాలు చేసి, శారీరక హింసపెట్టి మనుషుల్ని కాల్చుకు తినక్కర్లేదు. వ్యాపారం చేస్తే చాలు, అటు పుణ్యం, ఇటు పురుషార్థం వస్తాయని ప్రపంచానికి మొదట బోధించినవాడు వర్ధమాన మహావీరుడనే క్షత్రియ జ్ఞాని. ఆయన శిష్యులే ఇప్పటి మార్వాడి షావుకార్లు. వాళ్లు, డబ్బులు మాత్రమే దొంగిలిస్తారు కానీ, ప్రాణాలు దొంగలించరు. వృత్తిగా శాకాహారులు, అహింసావాదులు, ఐశ్వర్యవంతులు. డబ్బులు సంపాదించడం కూడా మహాపాతకమని చెప్పిన బుద్ధుడు, ఆ కారణం వల్లనే ఈ దేశంలో అడ్రసు లేకుండా పోయాడు...'




## మేధావి కానక్కర్లే.. అనిపించుకుంటే చాలు

మేధావి కాకపోయినా మేధావి అనిపించుకోడం సమాజంలో పైకి రావడానికి చాలా అవసరం. నిజమైన మేధావులతో స్నేహం చేసి వారు చెప్పేవి విని, విన్న దాంట్లో ఒకటీ అరా ముక్కలు ఆచితూచి అప్పుజెప్పడం ద్వారా మేధావులుగా చలామణీ అయిపోవచ్చు.. మేధావి అనే అబద్ధం జాగ్రత్తగా ప్రచారంలోకి తీసుకొచ్చిన తర్వాత ఎంత కష్టమైనపనైనా ఎడమ చేత్తో చేసి పారేస్తామన్న కల్పనని ప్రచారంలోకి తీసుకురావాలి. కష్టపడి ఏదైనా పూర్తిచేసిన వాడికంటే, సునాయాసంగా ఆ కష్టసాధ్యమైన పనిని పూర్తి చేసేవాడి మీదే ప్రజలకు గౌరవం ఎక్కువ కలుగుతుంది. ఫ్యాన్ కనిపెట్టినవాడు సృజనాత్మక మేధావి. దాన్ని తిరగేసి ఎగ్జాస్ట్ ఫ్యాన్ కింద వాడినవాడు యుక్తిపరుడు.

> 'నమ్మకాలన్నీ ఒకటే. నమ్మకాలు, మూఢ నమ్మకాలు అని విడివిడిగా ఉండవు. మన నమ్మకాల్ని మనం నమ్మకాలు అని గౌరవంగా పిలుచుకుంటూ, ఎదుటివాళ్ల నమ్మకాల్ని మూఢ నమ్మకాలు అనిపిలుస్తాం. ఈ నమ్మకాలు అనేక రకాలు. ఏ నమ్మకమైనా ప్రమాదకరమే.'

'గెలుపు సరే.. బతకం ఎలా?' పుస్తకంలో కంటెంట్ ఇంతకు ముందు వ్యక్తిత్వ వికాసం మీద కాని, కెరీర్ డెవలప్‌మెంట్ మీద గాని యండమూరి వీరేంద్రనాథ్, ది ఫైర్ రచించిన వేణు భగవాన్ గాని, కార్పొరేట్ స్థాయి పుస్తకాలు రచించిన శివ్‌ఖేరా పుస్తకాల్లో గాని కనిపించదు. దీన్ని తెలుగు పాఠకులు విశేషంగా ఆదరించారు. అయితే పెద్దగా ప్రచారానికి మాత్రం నోచుకోలేదు. దీని మీద సిద్ధార్థ సుభాష్ చంద్రబోస్ జరిపిన చిన్న విశ్లేషణ ఇది.

## దేవుడు అబద్ధం.. మతం నిజం

దేవుడు అబద్ధం, అయితే అతడి కుమారుడైన యేసుక్రీస్తు నెలకొల్పిన మతం నిజం. లేని దేవుడి దూత అయిన మహమ్మద్ ప్రవక్త స్థాపించిన ఇస్లాం మతం నిజం. హిందూ మతం కూడా అదే రకమైన అబద్ధాన్ని ఆశ్రయించుకుని కొనసాగుతోంది. ఈ మతాల మనుగడకు ఆ అబద్ధం ఎంత ముఖ్యమో, లెక్కలనే శాస్త్రం మనుగడకు సున్నా అనే అబద్ధం అంతే ముఖ్యం.. ఇదే విధంగా మంచితనం, ధర్మం, సత్యవాక్కు, పౌరుషం, ఆత్మగౌరవం, మంచిచెడ్డలనే విలువలూ ఆ కోవలోకే వస్తాయి. లేని విలువలు వున్నట్టు నటించడమే నాగరికత. ఈ నాగరిక సమాజంలో అన్నిటికంటే ఆసక్తికరమైనదీ, అన్నిటికంటే ఆకర్షణీయమైనదీ, మనుషులు తొడుక్కునే మారుమొగమే. ఫలానావాడు దాత, ఫలానావాడు ధర్మమూర్తి, ఫలానా వాడు పీక పోయినా అబద్ధం చెప్పడు, ఫలానావాడు మాట తప్పడు, ఫలానావాడు జన్మలో పరాయిసొమ్ము ఆశించలేదు అని నలుగురు పొగడ్డానికి ఈ మారుమొగాలే కారణం.

## నీతిగా, నిజాయితీగా వుండక్కర్లేని నాగరిక

సమాజంలో సకలవర్గాలు ఎన్నడో ఒక అవగాహనకు వచ్చాయి. కాబట్టి, అవినీతికి, వంచనకు, అసత్యానికీ అగౌరవం ఏమీ లేదు. కోర్టుల్లో భగవద్గీత, బైబిలు చేతిలో పెట్టి భగవంతుడి సాక్షిగా నిజం చెప్పమని అడుగుతారు. కానీ అబద్ధం చెప్పకుండా వుంటారని ఎవరూ ఆశించరు. రాజ్యం అనే స్టేట్ గురించి అనేక అపోహలు, అవగాహనలు ఉన్నాయి. అది చాలా దుర్మార్గమైనదని చాలామంది మేధావులు అంటూ ఉంటారు. కానీ, రాజ్యమంటే మానవజాతి తన స్వార్థం కోసం సమష్టిగా చేసుకున్న ఒక ఒప్పందం తప్ప మరొకటి కాదు. అది స్వార్థాన్ని, స్వప్రయోజనాన్ని కాపాడుతుంది. ఆ ఒప్పందపు సారం అదే.

# అమ్మాయిలకు టాలీవుడ్ సేఫేనా?!

జస్టిస్ హేమా కమిటీ ఇచ్చిన నివేదిక మలయాళ చిత్రసీమలో ప్రకంపనలు సృష్టించింది. ఇప్పుడు ఆ తాకిడి మిగిలిన చిత్రసీమలకూ తాకుతోంది. 'మాకూ అలాంటి కమిటీ ఒకటి వేయండి.. నిజాలు నిగ్గు తేల్చండి' అని వివిధ పరిశ్రమల నుంచి కథానాయికలు గొంతెత్తుతున్నారు. తాజాగా టాలీవుడ్‌కూ ఓ కమిటీ అవసరమని సమంత విజ్ఞప్తి చేయడం టాక్ ఆఫ్ ది టౌన్ అయ్యింది. సమంత లాంటి స్టార్ కథా నాయిక ఈ విషయంపై స్పందించడం, గొంతు విప్పడం కొత్త పరిణామం. జస్టిస్ హేమా కమిటీ ఇచ్చిన నివేదిక చూసి మలయాళ చిత్రసీమ నివ్వెరబోయింది. కళాత్మక చిత్రాలు తీసే మల్లూవుడ్ లో అమ్మాయిలపై ఇంత అరాచకం జరుగుతోందా? అని నోరెళ్లబెడుతున్నారంతా. అయితే అమ్మాయిలపై లైంగిక వేధింపులు, కాస్టింగ్ కౌచ్ ఇవన్నీ మలయాళ చిత్రసీమకే పరిమితం కాదు. అన్ని చోట్లా ఉన్నదే. కానీ అక్కడ బయటపడ్డారు. ఇక్కడ పడడం లేదు. అంతే తేడా. ఇప్పుడు ఎవరైనా సరే, తమ ఇబ్బందులు చెప్పుకోవడానికి మీడియా ముందుకే రావాల్సిన అవసరం లేదు. వాళ్ల చేతుల్లో సోషల్ మీడియా ఉంది. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాల ద్వారా తమ సమస్యని చెప్పుకొంటే.. దానిపై తప్పకుండా చర్చ జరుగుతుంది. అన్నింటికంటే అరాచకం ఏమిటంటే జూనియర్ ఆర్టిస్టుల వేదన. వాళ్లని మలయాళ చిత్రసీమలో బానిసలుగా ట్రీట్ చేస్తున్నారని, కనీసం బాత్‌రూమ్ సౌకర్యాలు కూడా ఇవ్వడం లేదని హేమ కమిటీ తన రిపోర్ట్ లో స్పష్టంగా పేర్కొంది. ఎండల్లో గంటల తరబడి నిలబెడతారని, షాట్ గ్యాప్ లో వాళ్లకు మంచి నీళ్ల లాంటి కనీస సౌకర్యాలు కూడా ఇవ్వరని, షూటింగ్‌లో గాయమైతే ఎవరూ పట్టించుకోరని నివేదిక నిగ్గు తేల్చింది. అమ్మాయిలకు ఒకలా, అబ్బాయిలకు మరోలా జూనియర్ ఆర్టిస్టులకు వేతనాలు చెల్లిస్తారు. ఈ విషయంలో శ్రమ దోపిడీ స్పష్టంగా కనిపిస్తోంది. టాలీవుడ్ లో జూనియర్ ఆర్టిస్టుల పరిస్థితి కాస్త నయం అనే చెప్పొచ్చు. జూనియర్ ఆర్టిస్ట్ అసోసియేషన్ వాళ్ల భద్రత కోసం అహర్నిశలూ కష్టపడుతోంది. అయితే వేతనాల విషయంలో అన్యాయం జరుగుతోంది. మీడియేటర్లకు కమీషన్ రూపంలో వచ్చే రాబడికి కోత పడుతోంది. దాంతో పాటు జూనియర్ ఆర్టిస్టు కార్డు కావాలంటే రూ.25 వేల రుసుము చెల్లించాల్సి వస్తోంది. రోజుకి రూ.500, 700 సంపాదించే వాళ్లకు పాతిక వేలంటే కష్టమే. ఈ రుసుము విషయంలో జూనియర్ ఆర్టిస్ట్ అసోసియేషన్ కాస్త కనికరం చూపించాల్సి వుంది. - తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

# ప్రగ్య అందాల జిగిబిగి చూసారా?




కంచె బ్యూటీ ప్రగ్య జైశ్వాల్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పని లేదు. చాలా కాలంగా స్టార్‌డమ్ కోసం ఈ బ్యూటీ చేయని ప్రయత్నం లేదు. నందమూరి బాలకృష్ణ సహా పలువురు యువహీరోల సరసన తెలుగులో అవకాశాలు అందుకున్న ప్రగ్య అటుపై బాలీవుడ్ లో సల్మాన్ భాయ్ సినిమాలోను నటించింది. కానీ పెద్ద సినిమాలేవీ తాను ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. తనకు కెరీర్ పరంగా అంతగా మైలేజ్‌ని ఇవ్వలేదు. అయినా పట్టువదలని ఈ బ్యూటీ ఇప్పటికీ తన ప్రయత్నాలను విరమించలేదు. మరోవైపు సోషల్ మీడియాల్లో ఆర్జన కోసం ప్రగ్య నిరంతరం ఫోటోషూట్లు, వీడియోలను షేర్ చేస్తోంది. సామాజిక మాధ్యమాల్లో అభిమానులకు నేరుగా టచ్ లో ఉంటోంది. తాజాగా ప్రగ్య షేర్ చేసిన ఓ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఈ కొత్త లుక్ యూత్ లోకి వేగంగా దూసుకెళుతోంది. ప్రగ్య హాఫ్‌వైట్ చీరలో ఎంతో అందంగా ఒద్దికగా కనిపిస్తోంది. కాంబినేషన్‌గా హాఫ్ షోల్డర్ వైట్‌బ్లౌజ్‌ని ధరించి, నాభి దిగువగా చీర కుచ్చిళ్లను దోపిన వైనం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆన్ లొకేషన్ నుంచి ఈ స్పెషల్ ఫోటోషూట్‌ని ప్రగ్య షేర్ చేసిందని ఫోటోలు చూస్తే అర్థమవుతోంది. అయితే ప్రగ్య వైట్ అండ్ స్వీట్ లుక్ చూశాక నెటిజనులు రకరకాలుగా కామెంట్ చేస్తున్నారు. ప్రగ్య రతి రాణిని తలపిస్తోంది అంటూ ఒక అభిమాని ఘాటుగానే వ్యాఖ్యానించాడు. తెలుగు, హిందీలో అడపాదడపా అవకాశాలొస్తున్నాయి. ఇటీవల వెబ్ సిరీస్‌లలో నటించేందుకు సంతకాలు చేస్తోందని సమాచారం. తాజా ప్రాజెక్ట్ గురించి మరిన్ని వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...

# ఈ పిల్లాడు మీ పేరు నిలబెడతాడు!!

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన భానుమతికి హస్తసాముద్రికం, జ్యోతిషంలోనూ ప్రవేశముంది. అందుకే ఎంతోమంది నటీనటులు భానుమతిని శుభముహూర్తాల గురించి అడిగేవారట. అలా ఎమ్జీఆర్, ఎన్టీఆర్ కూడా సూపర్ స్టార్స్ గా రాణిస్తారని భానుమతి వారితో నటించేటప్పుడే జోస్యం చెప్పారట. అలాగే బాలయ్య తొలి సినిమాలోనే ఆయనకు ఆమె భవిష్యవాణి వినిపించారు. ఆమె వాక్కు వృథా పోలేదు. బాలయ్య తండ్రి పేరు నిలిపే కొడుకుగానే నిలిచాడు. 'తాతమ్మ కల' సినిమా కోసం ఆరోజు బాలకృష్ణ తొలిసారిగా కెమేరా ముందుకు వచ్చారు. ఓ వైపు బహుముఖ ప్రజ్ఞాశాలి భానుమతి, మరోవైపు నటనలో మేరునగధీరుడైన తండ్రి ఎన్టీఆర్ , కాంచన వంటివారు ఉన్న సన్నివేశంలో బాలకృష్ణ తొలిసారి నటించాల్సి వచ్చింది. డైరెక్టర్ గా ఎన్టీఆర్ , బాలకృష్ణకు అంతకు ముందే సన్నివేశాన్ని వివరించి ఎలా నటించాలో తెలిపారు. ఎన్టీఆర్ చెప్పినది తలకెక్కించుకున్న బాలయ్య, మనసులో మాత్రం తండ్రి 'నిండుమనసులు' చిత్రంలో నటించిన తీరును మననం చేసుకుంటూ సీన్ లో నడుస్తూ వచ్చాడు. వెంటనే ఎన్టీఆర్ ఆగ్రహంతో 'రేయ్... నీకు నేను చెప్పిందేంటి? నువ్వు చేసేందేంటి? ఏమిటా నడక... రౌడీలా' అని హూంకరించారు. అంతే బెంబేలెత్తి పోయాడు చిన్నారి బాలయ్య. అయినా తమాయించుకొని భానుమతి, రామారావు కలసి ఉన్నా అదురు బెదురు లేకుండా తరువాత నటించి సీన్ ఓకే చేశారు. ఆనాడే భానుమతి, 'రామారావుగారూ... మీరు అనవసరంగా పిల్లాణ్ణి భయపెట్టకండి. అబ్బాయి చక్కగా నటించాడు. చూడండి మీ పేరు నిలబెడతాడు' అని దీవించారు.




- పులగం చిన్నారాయణ

**ప్రపంచంలో అత్యధిక ప్రజాదరణ పొందిన అత్యున్నత క్రీడా పోటీల్లో ఒలింపిక్స్ ఒకటి. మన దేశం అధికారికంగా 1900 సంవత్సరం ఒలింపిక్స్‌లో ప్రవేశించింది. నాటి నుంచి 25 ఒలింపిక్స్‌లో పాల్గొంటే 41 పతకాలు సాధించగా, ఇందులో 16 పతకాలు హర్యానా క్రీడాకారులు పొందటం మరో విశేషం. ఈ ఏడాది పారిస్‌లో జరిగిన 33వ ఒలింపిక్స్ క్రీడా పోటీల్లో మనం 6 పతకాలతో 71వ స్థానంలో నిలిచాం. ఇప్పటి వరకు 30సార్లు ఒలింపిక్స్ జరిగితే మొదటి స్థానంలో అమెరికా 19 సార్లు నిలవగా, సోవియట్ యూనియన్ 7 సార్లు నిలిచింది. ఈసారి కూడా అమెరికా, చైనా పోటాపోటీగా తలపడి మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. క్రీడల పట్ల మన పాలకులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో ఈ లెక్కలు చూస్తే తెలుస్తుంది. క్రీడాభివృద్ధికి నిధులేవీ? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో క్రీడలకు నిధులు కేటాయించడంలో గానీ లేదా ఖర్చు చేయడంలో గానీ చాలా అలసత్వం, ప్రాధాన్యత లేని అంశంగా చూడటమే క్రీడాకారులకు నేడు శాపంగా మారింది.**



# క్రీడలపై పాలకుల నిర్లక్ష్యం

# ఇంతింత కాదయా!

- కేంద్ర ప్రభుత్వం అత్యున్నత క్రీడాకారులను తీర్చి దిద్దేందుకు తీసుకొచ్చిన ఖేలో ఇండియా పథకం దక్షిణాది రాష్ట్రాల పట్ల తీరని వివక్షత చూపుతోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, ఇతర రాష్ట్రాలకు మరో న్యాయం చూపిస్తుంది.
- 'పతకం కొట్టు జాబ్ పట్టు' అంటూ హర్యానా, పంజాబ్, కేరళ, తమిళనాడు, ఒడిశా లాంటి రాష్ట్రాలు ఉన్నంతలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం క్రీడల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైంది.
- పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ప్రతి గ్రామంలో మినీ స్టేడియాలను నిర్మిస్తే మన రాష్ట్రంలో నియోజకవర్గ కేంద్రాలకే దిక్కు లేదు. అక్కడ నియోజకవర్గ కేంద్రాల్లో స్పోర్ట్స్ స్కూల్ నిర్మిస్తే మన పాలకులు మాత్రం విజయనగరం జిల్లాలో ఉండే స్పోర్ట్స్ స్కూల్‌ను మూసివేసి క్రీడల పట్ల తమ 'నిజాయితీ'ని నిరూపించుకున్నారు!
- జెడ్పీ హైస్కూల్లో కనీసం స్పోర్ట్స్ మెటీరియల్ కూడా లేని పరిస్థితిలో ఉంటే క్రీడలు ఎలా అభివృద్ధి అవుతాయో పాలకులే చెప్పాలి.

గత పదేళ్లుగా కేంద్ర బడ్జెట్‌ను పరిశీలిస్తే 2014-15లో రూ.1769కోట్లు కేటాయించగా ఇది వరుసగా రూ.1943, రూ.2197, రూ.2596, రూ.2776, రూ.2826 కోట్లు కేటాయించారు. 2024-25లో రూ.3442 కోట్లు. గతేడాది కన్నా రూ.45 కోట్లు పెంచారు. దీన్నిబట్టి చూస్తే బడ్జెట్‌లో జీడీపీ పెరుగుదల ద్వారా పెరగడం తప్ప పాలకులు క్రీడలకు ఇచ్చిన ప్రాధాన్యత ఏమీ లేదని అర్థం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అత్యున్నత క్రీడాకారులను తీర్చి దిద్దేందుకు తీసుకొచ్చిన ఖేలో ఇండియా పథకం దక్షిణాది రాష్ట్రాల పట్ల తీరని వివక్షత చూపుతోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఒక న్యాయం, ఇతర రాష్ట్రాలకు మరో న్యాయం చూపిస్తుంది. ఖేలో ఇండియా ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు రూ.2168 కోట్లు ఖర్చు చేస్తే ఇందులో గుజరాత్‌కు రూ.426 కోట్లు, ఉత్తరప్రదేశ్‌కు రూ.438 కోట్లు, అరుణాచల్‌ప్రదేశ్‌కు రూ.148 కోట్లు, రాజస్థాన్‌కు రూ.107 కోట్లు, మధ్యప్రదేశ్‌కు రూ.94 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ.21 కోట్లు, తెలంగాణకు రూ.18 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

### ఏపీలో క్రీడా విధానం ఏదీ?

'పతకం కొట్టు జాబ్ పట్టు' అంటూ హర్యానా, పంజాబ్, కేరళ, తమిళనాడు, ఒడిశా లాంటి రాష్ట్రాలు ఉన్నంతలో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం క్రీడల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా తయారైంది. జీవో నెంబర్ 74 ప్రకారం ప్రతి ఉద్యోగంలో 4 శాతం కోటాను నిజాయితీగా అమలు చేస్తున్నారు. రాష్ట్ర విభజన అనంతరం క్రీడలకు మరింత గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. రాష్ట్ర బడ్జెట్లో క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయించకుండా టూరిజం, యువజన సర్వీసుల శాఖ పేరుతో కలిపి నిధులు కేటాయించడం జరుగుతుంది. బడ్జెట్లో నిధులు చూపించినా ఖర్చు చేయడం లేదు. ఒకవేళ ఖర్చు చేస్తే అవి క్రీడలకు ఖర్చు చేయడం లేదు. 2006లో హర్యానా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీ తెచ్చి దేశానికి క్రీడా పోటీల్లో ఆదర్శంగా నిలిచింది. పంజాబ్, హర్యానా రాష్ట్రాలు ప్రతి గ్రామంలో మినీ స్టేడియాలను నిర్మిస్తే మన రాష్ట్రంలో నియోజకవర్గ కేంద్రాలకే దిక్కు లేదు. అక్కడ నియోజకవర్గ కేంద్రాల్లో స్పోర్ట్స్ స్కూల్ నిర్మిస్తే మన పాలకులు మాత్రం విజయనగరం జిల్లాలో ఉండే స్పోర్ట్స్ స్కూల్‌ను మూసివేసి క్రీడల పట్ల తమ 'నిజాయితీ'ని నిరూపించుకున్నారు!

ఏపీలో గతంలో 'హ్యాపీ సండే' పేరుతో అయినా ఏదో ఒక కార్యక్రమం జరిగేది. ఇప్పుడు అది కూడా ఆగిపోయింది. 175 నియోజక వర్గాల్లో తక్షణమే మినీ స్టేడియాలను, క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటుచేయాలి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) శాప్ పరిధిలో 15 మంది పర్మినెంటు కోచ్‌లు కూడా లేరంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఔట్ సోర్సింగ్ కింద ఉన్న 97 మంది కోచ్‌లకు సరైన వేతనాలు లేక, సమయానికి ఇవ్వక, అధికారుల ఒత్తిడి కారణంగా, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి గురించి ఆలోచించకుండా క్రీడలు ఎలా అభివృద్ధి అవుతాయి? కాంట్రాక్ట్ కోచ్‌లను పర్మినెంటు చేయడానికి శాప్‌కు వచ్చిన ఇబ్బందులు ఏమిటి? కొత్తగా మరో 500 మంది కోచ్‌లను నియమించకుండా రాష్ట్రంలో క్రీడా అభివృద్ధి సాధ్యమా? గత మూడేళ్లుగా జాతీయ క్రీడల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులు పెండింగ్‌లో ఉన్నాయి. బంగారు పతకానికి రూ.5 లక్షలు, వెండి పతకానికి రూ.3 లక్షలు, కాంస్యానికి లక్ష రూపాయలు ఇవ్వాలని శాప్ నిబంధనలు ఉన్నాయి. మరి ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వడం లేదు. ఇచ్చినా సగం మాత్రమే ఎందుకు ఇస్తున్నారు. మిగతా సగం ఎప్పుడు ఇస్తారో ఎవరికి తెలియదు. పథకాలు సాధించిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహానికే నిధులు లేకపోతే క్రీడా అభివృద్ధి ఎలా సాధ్యం అవుతుంది?

రాష్ట్రంలో అత్యున్నత క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు క్రీడాకారులకు శిక్షణా, క్రీడా సామగ్రి సమకూర్చి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారుచేయడం శాప్ ఉద్దేశం. కానీ నేడు దానికి భిన్నంగా నేడు శాప్ వ్యాపారం చేస్తుంది. క్రీడా మైదానాలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియాలను, స్విమ్మింగ్ పూల్, జిమ్ సెంటర్లను ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం జరుగుతుంది. దీంతో క్రీడాకారులు గ్రౌండ్‌లో అడుగు పెట్టాలంటే డబ్బు చెల్లించి రావాల్సిన పరిస్థితి. శాప్ అధికారులు ఇప్పటికైనా వ్యాపారం మాని క్రీడాభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. పే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయకపోతే క్రీడలు బతకవు. యువతను క్రీడల వైపు నడిపిస్తేనే సమాజం బాగుపడుతుంది. ఎక్కువ భాగం యువత డ్రగ్స్ వైపు, గంజాయి వైపు పోతూ నిర్వీర్యం అవుతుంటే మనకి బాధ్యత లేదా. తప్పకుండా యువత క్రీడల వైపు పయనించాలి. మాయమైపోతున్న క్రీడలను భుజం భుజం కలిపి రక్షించుకోవాలి. మన దేశంలో గానీ, రాష్ట్రంలో గానీ ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు క్రీడలు తప్పనిసరిగా ఉండాలనేది చేయలేకపోతున్నం.

మన రాష్ట్రంలోనే వేల సంఖ్యలో పీఈటీ, పీడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు 10వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలో ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు లేడని గణాంకాలు చెబుతున్నాయి. విద్యార్థులకు క్రీడలు ఎలా నేర్పుతారు? ఎవరు నేర్పుతారు? ఇంక కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలైతే సరేసరి. ఉదయం నుంచి రాత్రి వరకు బట్టి చదువులు తప్ప ఇంకేమీ ఉండదు. ప్రభుత్వం అన్ని సబ్జెక్టుల మాదిరిగా వ్యాయామ విద్య కూడా ఒక సబ్జెక్టుగా చేసి మార్కులు ఇస్తే గానీ క్రీడలు బాగుపడవు. అలాగే తల్లిదండ్రులకు గేమ్స్ వల్ల ఉపయోగాలు, అవకాశాలపై అవగాహన కల్పించాలి. క్రీడలు కేవలం గెలుపు కోసం కాదు. ప్రైజ్ మనీ కోసం కాదు. ఉద్యోగంలో కోటా కోసమూ కాదు. క్రీడలు స్నేహ సంబంధాలు నెలకొల్పి తద్వారా ఐక్యతను పెంచుతాయి. మానసిక ఉల్లాసం ఇస్తాయి. చదువుల పట్ల ఒత్తిడి తగ్గిస్తాయి. దేహ దారుఢ్యం పెంచుతాయి. శారీరక వ్యాయామం అనేక వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది. మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది. నేడు యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను తిప్పికొట్టడానికి క్రీడలు ఒక ఆయుధంగా పని చేస్తాయి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి. ఎస్‌జీఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) సర్టిఫికెట్‌కు మంచి విలువ ఉంది. ఇప్పుడు ఇది కూడా పక్కదారి పడుతున్నది. అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కారణం ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడం. వీరు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో గేమ్స్ నిర్వహించడం జరుగుతుంది. కానీ దీనికి ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వడం లేదు. రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు విద్యార్థులే పెట్టుకోవాల్సి వస్తుంది. దీంతో వారు అక్కడే అగిపోతున్నారు. కొంతమంది వ్యాయామ ఉపాధ్యాయులు తమ ఖర్చుతో తీసుకుపోతున్నారు. ఇది ఎంతకాలం సాధ్యం అవుతుంది. జిల్లా పరిషత్ హైస్కూల్లో కనీసం స్పోర్ట్స్ మెటీరియల్ కూడా లేని పరిస్థితిలో ఉంటే క్రీడలు ఎలా అభివృద్ధి అవుతాయో పాలకులే చెప్పాలి. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలి. ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు క్రీడా పోటీల్లో పాల్గొనే ప్రతి క్రీడాకారుడికి బస్సు, ట్రైన్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను పెంచాలి. ప్రతి విద్యాసంస్థలో వ్యాయామ విద్య తప్పనిసరి సబ్జెక్టు చేసి మార్కులు ఇవ్వాలి. క్రీడాభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక అమలుచేయాలి. అన్యాక్రాంతమైన క్రీడా మైదానాలను కాపాడాలి. క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులు, యువజన సంఘాల అభిప్రాయాలతో స్పోర్ట్స్ పాలసీ ప్రకటించాలి.

**- జి.రామన్న, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి, 91775 90726**

## ఖాదీ పరిశ్రమలో శిక్షణకు నమూనా సర్వే

**(సత్యంన్యూస్, పొందూరు)**

పొందూరు ఖాదీ పది కాలాల పాటు బతికించేందుకు ఖాదీ, చేనేత కుటుంబాలకు చెందిన యువతీ, యువకులకు శిక్షణనిచ్చేందుకు నమూనా సర్వే జరుపుతున్నట్లు లీడర్ పీపుల్స్ సంస్థ నిర్వాహకులు వి.వి.రమణమూర్తి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మొత్తం 25 మందికి శిక్షణ ఇచ్చి ఆకర్షణీయమైన స్టైఫండ్ చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 94905 28730 నెంబరును సంప్రదించాలన్నారు.

## డాక్టర్ ఇంజరాపు సేవలు కొనసాగాలి




**(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)**

డాక్టర్ ఇంజరాపు మోహన్ రావు సేవలు నిరంతరం కొనసాగాలని, నిస్వార్థ సేవలకు చిరునామాగా నిలిచారని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. శనివారం అరసవల్లికి చెందిన డాక్టర్ మోహన్‌రావు జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి మాట్లాడుతూ నగర ప్రజల ఆశాదీపం, ఎవరికి ఏ ఆపదొచ్చినా నేనున్నానంటూ ముందుకు వస్తారని, కరోనా కష్టకాలంలో ఆయన చేసిన సేవలకు డాక్టరేట్ కూడా అందుకోవటం హర్షణీయమన్నారు. ప్రతిఒక్కరూ ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని, ముఖ్యంగా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలన్నారు. పలువురికి లక్ష్మీదేవి చేతుల మీదుగా జ్ఞాపికను అందించి అరసవల్లి దేవస్థాన కండువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇంజరాపు మాట్లాడుతూ తనకు సహకరించి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రతిఒక్కరికీ, రక్తదానం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మెగా రక్తదానం నిర్వాహకులు నవతరం చైతన్యకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నంది ఉమాశంకర్, జాతీయ అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, ప్రోగ్రాం మేనేజర్ గొలివి రమణ, బత్తిలి రమేష్, బొద్దన వెంకటేష్, ఎం.అప్పన్న, కుటుంబ సభ్యులు, రక్తదాతలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎండీయూ ఆపరేటర్లకు న్యాయం చేస్తా

**పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల హామీ**



**(సత్యంన్యూస్, విజయవాడ)**

గత ప్రభుత్వం ఇంటింటికి రేషన్ ప్రజా పంపిణీ వ్యవస్థ స్థాపించి చాలా డబ్బు వృధా చేసిందని, అయితే ఎండీయూ ఆపరేటర్స్ ఎవరికి అన్యాయం జరగకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించి ఏ నిర్ణయమైనా తీసుకుంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ భరోసా ఇచ్చారు. శుక్రవారం ఎండీయూ ఆపరేటర్స్ రాష్ట్ర యూనియన్ నాయకులు తెనాలిలోని మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఎండీయూ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇటీవల పత్రికలు, సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు 9,200 మంది ఎండీయూ ఆపరేటర్లు, 9200 మంది వారి హెల్పర్ల కుటుంబాలు రోడ్డున పడే విధంగా ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఎండీయూ ఆపరేటర్స్ రాష్ట్ర సమైక్య యూనియన్ ప్రధాన కార్యదర్శి కాజా శ్రీనివాస్, ట్రెజరర్ సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## 18వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)**

సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం కావడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శనివారమే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈమేరకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో 18వ డివిజన్ ఇన్‌ఛార్జి గోవిందరావు చేతుల మీదుగా లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొండలరావు, చిన్న మహాలక్ష్మి, సత్యనారాయణ, గంగి కృష్ణ, పాపారావు, నీలయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.





సెప్టెంబర్ నెల ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సామాజిక పింఛన్లు ప్రతీ లబ్ధిదారుకు శనివారం ఇంటివద్దనే అందించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని 2వ డివిజన్‌లో ఇన్‌ఛార్జి ఎ.రాజారావు ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, రమణ, సచివాలయ కార్యదర్శి స్వరూప్ పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్**



నగరంలోని 31వ డివిజన్ పరిధి దండివీధి పట్నాయక్ కాలనీ, ఏపీహెచ్‌బీ కాలనీ తదితర ప్రాంతాల్లో టీడీపీ 31వ డివిజన్ ఇన్‌ఛార్జి విభూది సూరిబాబు సమక్షంలో లబ్ధిదారులకు పెన్షన్‌ను సచివాలయ ఉద్యోగులు అందజేశారు. కార్యక్రమంలో పొదిలాపు వెలమనాయుడు, అబు కురేసి, ఎ.శ్రీనివాసు, విభూది నమశ్శివాయ, కవిత, కమల, కె.శ్రీదేవి, హెల్త్ సెక్రటరీ పార్వతి, ఆశ వర్కర్ లక్ష్మి పాల్గొన్నారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్**

ఎం.ఇమ్రాన్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SriAaKaSa
YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLiSc, B.SC (all groups), BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA, M. SC (All Subjects), MLiSc, M.Tech
Computer Applications, Cyber Security, Digital Marketing, Hospital Management, Tourism Management

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 33395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

# గ్రూపుల గుద్దులాట.. టీడీపీలో ఇసుకాట!

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు కలమట వెంకటరమణ అడ్డుకున్నారు. దీంతో నియోజకవర్గంలో పాతకాపులు, కొత్త ఎమ్మెల్యే వర్గానికి మధ్య ఉన్న పొరపొచ్చాలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే అండదండలతో ఇసుక తరలిపోతోందంటూ ఎక్కడా కలమట రమణ తన పేరు ప్రస్తావించకుండానే అధికారుల మీదకు ఈ నెపాన్ని నెట్టేశారు.

### ఒడిశా బిల్లులతో అకులతంపర నుంచి..

వాస్తవానికి స్థానిక నాయకుల ప్రోద్బలంతోనే ఇసుక తరలిపోతుందన్న విషయం కలమట రమణకు తెలియంది కాదు. ఒడిశా ప్రభుత్వం నుంచి కొనుక్కున్న బిల్లుతో జిల్లాలో కొత్తూరు మండలం ఆకులతంపర రేవు నుంచి ఇసుకను తరలించేస్తున్నారు. వాస్తవానికి ఆకులతంపరకు ఏ దిక్కులో కూడా ఒడిశా బోర్డర్ ఉండదు. కానీ ఒడిశా బిల్లులు చూపించి లారీలకు లారీల ఇసుకను తరలించేస్తుంటే చూస్తూ ఊరుకోవడం అధికారుల వల్ల మాత్రమే జరిగే పని కాదు. దీని వెనుక రాజకీయ యంత్రాంగం ప్రమేయం ఉంటుంది. అందుకే కలమట రమణ ఓ పథకం ప్రకారం మొదట గ్రామస్తులతో లారీలు అడ్డుకునేటట్టు చేసి శనివారం ఉదయం ఆయన రంగంలోకి దిగారు. జిల్లాలో నేరడి, తాళాడ నదీ పరివాహక ప్రాంతాలకు ఓవైపు ఒడిశా బోర్డర్ ఉంటుంది. పోనీ అక్కడ ఇసుకను తవ్వుకొని ఒడిశా బిల్లు చూపించి ఆంధ్రా రోడ్డు ఎక్కారంటే ఒక అర్థముంది. కానీ ఆంధ్రాలోనే ఉన్న ఆకులతంపరలో ఇసుక ఎత్తడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమే. భామిని మండలం బాలేరులో ఒడిశా అనుమతులతో ఇసుక తవ్వుకునే వెసులుబాటు ఉంది. కాకపోతే ఆంధ్రా రోడ్డు మీదుగానే లారీలు ప్రయాణించాల్సి ఉంటుంది. ఇందుకోసం స్థానిక తహసీల్దార్ అనుమతి తీసుకోవాలి. ఆకులతంపరలో మాత్రం ఒడిశా బిల్లుతో ఇసుక ఎత్తడానికి ఏమాత్రం అధికారాలు లేవు. కానీ అక్కడ టీడీపీ నాయకుల అండదండలతోనే తరలిపోతుందన్న విషయం కలమట రమణకు తెలియందికాదు. ప్రస్తుతానికి రాష్ట్ర ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు రెగ్యులర్ పాలసీ తీసుకురాలేదు. రెండురోజుల్లో డి-పట్టా భూముల్లో ఇసుక తవ్వడానికి అనుమతులు ఇవ్వనుంది. అంతవరకు నారాయణపురం కాలువల్లో పేరుకుపోయిన ఇసుకను తవ్వడానికి కాఖండ్యాం వద్ద ఒకటి, గార మండలంలో ఒక రీచ్‌కు అనుమతులిచ్చింది. కానీ పాతపట్నం నియోజకవర్గంలో మాత్రం గత కొద్ది రోజులుగా ఇసుక యథేచ్ఛగా తరలిపోతోంది. ఒడిశా పేరుతో ఒక మాఫియా ఆంధ్రాలో మకాం వేసి మీడియాను బెదిరించి లేదా ప్రలోభపెట్టి మరీ ఇసుకను తవ్వుకుపోతోంది. ఇప్పుడు స్వయంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడే అక్రమ తరలింపును అడ్డుకోవడంతో ఈ వ్యవహారం పతాక శీర్షికలకు ఎక్కనుంది.

### గ్రూపుల గోలలో బట్టబయలు

పాతపట్నంలో ఎప్పట్నుంచో కలమట రమణ, మామిడి గోవిందరావులు రెండు గ్రూపులుగా టీడీపీ రాజకీయాలు చేస్తున్నారు. గోవిందరావు ఎమ్మెల్యేగా, కలమట రమణ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ గ్యాప్ మరింత పెరిగింది. ఎన్నికల్లో పోటీకి టికెట్ వచ్చిన తర్వాత కలమట రమణను గోవిందరావు కలిశారు. కానీ ఎమ్మెల్యే అయిన తర్వాత ఇప్పటికీ వీరిద్దరూ అక్కడ చేతులు కలపలేదు. గోవిందరావు గెలుపులో కలమట రమణ పాత్ర ఎంత ఉంది? ఎన్ని ఓట్లు వేయించుంటారు? చెప్పాలని తెలుగు వన్ ఛానల్ విలేకరి ప్రశ్నిస్తే.. నమస్కారమంటూ ఆ ప్రశ్నను అక్కడితో ముగించేశారు. వీరిద్దరి మధ్య ఇప్పటికీ పొరపొచ్చాలు ఉన్నాయి. అయితే టీడీపీ సింబల్‌తో గోవిందరావు పోటీ చేయడం వల్ల క్యాడర్ ప్రస్తుతం ఆయనతోనే ఉన్నారు. అలాగే వైకాపా అసమ్మతి నాయకులు కూడా మొన్నటి ఎన్నికల ముందు నుంచీ గోవిందరావుకే మద్దతు తెలుపుతున్నారు. ఈ నియోజకవర్గంలో ఇసుక అతి పెద్ద ఆదాయవనరు. దీన్ని స్థానిక ఎమ్మెల్యే అండదండలు లేకుండా అక్రమంగా తరలించుకుపోవడం దాదాపు అసాధ్యం. దీని వెనుక చేతులు మారే సొమ్ము ఎమ్మెల్యే కార్యాలయానికే చేరుతోందన్న భావనతోనే కలమట రమణ అక్రమ రవాణాను అడ్డుకున్నారు. 12 చక్రాల లారీ లోడు ఇసుక విశాఖపట్నానికి చేరాలంటే రూ.70వేలకుపైగా వసూలు చేస్తున్నారు. ఇందులో రూ.30 వేలు స్థానికంగా కప్పం కడుతున్నారు. ఇది పత్రికలంటున్న మాట కాదు. స్వయంగా టీడీపీ అధ్యక్షుడు కలమట రమణ శనివారం మీడియాకు చెప్పిందే. అదే సమయంలో అక్రమంగా ఇసుక తవ్వుకుపోతున్నారని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. అధికార పార్టీ జిల్లా అధ్యక్షుడే చెప్పినప్పుడు తహసీల్దార్‌స్థాయి వ్యక్తులు పట్టించుకోకుండా ఉండరు. పట్టించుకోలేదంటే కచ్చితంగా అక్కడి పెద్దల అండదండలు ఉన్నట్లేనని కలమట రమణ మాటలు స్పష్టం చేస్తున్నాయి.

# రంగుల హంగుల్లో.. అవినీతి 'చిత్రాలు'!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నలుగురూ తిరిగేచోట నాలుగు గోడలు ముస్తాబవడం మంచిదే. అయితే అందుకు అనుసరించే పద్ధతి సముచితంగా ఉండాలి. అలా కాకుండా తాడేపల్లిగూడెం నుంచి ఒక కాంట్రాక్టర్‌ను పంపించి ఆయనతోనే ఈ పనులన్నీ చేయించుకోండంటూ తెర వెనుక నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఇక్కడ అధికారులు, నాయకులు అన్నింటినీ పక్కన పెట్టి ఉన్నఫళంగా సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు ఎలా చెల్లించాలా అనే ఆలోచనలో ఉన్నారు. ఈ పనులకు ఎటువంటి టెండరు వేయకుండా తాడేపల్లిగూడేనికి చెందిన సింగం త్రిమూర్తులు మిగిలిన కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నట్టు విమర్శలున్నాయి. అదే సమయంలో నగరంలోని గోడలకు ఆయన పెయింట్లు వేసుకుపోతున్నారు. ఏ ప్రక్రియా పూర్తికాక ముందే ఆర్ట్స్ కళాశాల రోడ్డులో రూ. 25 లక్షల పనులు చేసేశారు. ఇదేమని ప్రశ్నిస్తే నామినేషన్ పద్ధతిలో ఇవ్వాల్సి వచ్చిందని మున్సిపల్ అధికారులు చేతులెత్తేస్తున్నారు. అయితే నగరపాలక సంస్థ ఈ-టెండర్ పిలిచిన 10 పనుల్లో ఆర్ట్స్ కళాశాల లేకపోవడం వెనుక కారణాలేమిటో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆర్ట్స్ కళాశాల రోడ్డులో గోడలకు పెయింటింగ్ వేయడంతో పాటు ఫుట్‌పాత్‌తోపాటు ప్రైవేట్ ఇళ్ల ప్రహరీలకు, పాన్‌షాపులకు రంగులు వేసి రూ.25 లక్షల బిల్లు పెట్టినట్టు తెలుస్తోంది. వీటిని అత్యవసర పనులుగా చూపించి నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి మంజూరు చేస్తున్నారు. ఈ బిల్లును సీఎఫ్ఎంఎస్ ద్వారా కాకుండా చెక్కు రూపంలో ఏకమొత్తానికి ఇచ్చేసినట్లు చర్చ జరుగుతోంది. ఇందుకోసం బ్యాక్‌డేట్ వేసి చెక్కు ఇచ్చారని చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.5 లక్షలకు మించిన పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించడానికి వీల్లేదు. దీంతో దీన్ని అత్యవసర పనిగా చూపించి త్రిమూర్తులుకు కట్టబెట్టినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

### 2023లోనే వేసినా..

నగరాన్ని సుందరీకరించడానికి ఒక్కో ప్రభుత్వం ఒక్కో విధానం అవలంభిస్తుంది. గోడలకు రంగులు పూయడం ఇదే మొదటిసారి కాదు. నగరంలో 2018కి ముందు పార్కులకు రంగులు వేసేవారు. 2018 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్రస్థాయిలో ఇక్కడే చేయడం వల్ల సుందరీకరణ ప్రక్రియ నగరమంతా విస్తరించింది. దీనికి రూ.కోట్లల్లోనే ఖర్చు చేశారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తర్వాత పాత పెయింటింగుల స్థానంలో కొత్తవి వేయాలని ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఖరారు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించారు. 2022 ఆగస్టులో కాకినాడకు చెందిన ఎన్టీఆర్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు ఈ-టెండర్ ద్వారా రూ.1.43 కోట్లకు ఈ పనులు అప్పగించారు. 2023 మార్చి వరకు సుమారు ఎనిమిది నెలల పాటు నగరంలోని 23 ప్రాంతాల్లో రంగులు, చిత్రాలు వేశారు. ఇప్పుడు అవే పెయింటింగులను చెరిపేసి మళ్లీ వేస్తున్నారు.

### నామినేషన్ పేరుతో పనులు.. చెల్లింపులు

ఈ-టెండర్ బిడ్డింగ్‌కు సెప్టెంబర్ తొమ్మిదో తేదీ వరకు సమయం ఉంది. కానీ టెండర్ ప్రక్రియ పూర్తి కాకుండానే కాంట్రాక్టర్ త్రిమూర్తులు అమరావతి పేరు చెప్పి నగరంలో గుర్తించిన పది ప్రాంతాల్లో పనులు ప్రారంభించేశారు. అయినా నగరపాలక సంస్థ అధికారులు ప్రశ్నించే సాహసం చేయడం లేదు. రిమ్స్ గేట్‌కు పశ్చిమ దిశ ప్రహరీగోడకు రంగులు వేయడానికి రూ.8,38,242, మిల్లు జంక్షన్ నుంచి సూర్యమహల్ జంక్షన్ వరకు ఫుట్‌పాత్ పెయింటింగ్‌కు రూ.8,32,208, ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ గోడలకు పెయింటింగ్స్‌కు రూ.8,28,274, ఏడురోడ్ల కూడలి నుంచి బాపూజీ కళామందిర్ వరకు వాల్ పెయింటింగ్స్‌కు రూ.8,26,740 ఖర్చు చేయాలని నిర్ణయించారు. సూర్యమహల్ నుంచి మిల్లు జంక్షన్ వరకు రూ.8,24,337, ఆర్ అండ్ బీ నుంచి పీఎస్ఎన్ ఎంహెచ్ స్కూల్ వరకు రూ. 8,23,986, పీఎస్ఆర్ కూడలి నుంచి కలెక్టర్ బంగ్లా రోడ్డు వరకు రూ.8,21,016, నగరపాలక సంస్థ కార్యాలయం ప్రహరీ గోడ పెయింటింగ్స్‌కు రూ.7,77,600, ఆదివారంపేట వద్ద వద్ద పనులకు రూ.6,67,116, సూర్యమహల్ జంక్షన్ నుంచి రామలక్ష్మణ జంక్షన్ వరకు ఫుట్‌పాత్ పెయింటింగ్‌కు రూ.5,86,824 వెచ్చిస్తున్నారు. వీటిలో రెండు ఫుట్‌పాత్‌లకు రంగు వేయడానికే రూ.14 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వీటన్నింటికీ ఈ-టెండర్ ద్వారా బిడ్స్ ఆహ్వానించారు. టెండర్లు దాఖలు చేస్తుందుకు అనుభవం ఉన్న కాంట్రాక్టర్లు ముందుకొస్తున్నా వారిని రానీయకుండా త్రిమూర్తులు అమరావతి పెద్దల ద్వారా భయపెట్టి అడ్డుకుంటున్నారని ఆరోపణలున్నాయి. నగరంలో గోడలకు రంగులు వేయడానికి గత ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం కూడా రూ.1.15 కోట్లు వెచ్చిస్తున్నా.. ఈసారి రూ.25 లక్షల పనులను అత్యవసరం పేరుతో టెండర్లు పిలకుండా బిల్లులు చెల్లించేయడమే విడ్డూరం. నగరపాలక సంస్థకు వస్తున్న అరకొర ఆదాయం నుంచే రంగుల హంగుల కోసం అత్యవసరం పేరుతో రూ.80 లక్షలు ఖర్చు చేయడం బాధాకరం. ఇలాంటి వ్యవహారాలే ప్రభుత్వాలు మారిన తర్వాత అధికారుల మెడకు చుట్టుకుంటుంటాయి.

## ఎప్పుడొచ్చామన్నది కాదన్నాయ్..
# పని జరిగిందా లేదా!?



శుక్రవారం రాత్రి పరిస్థితి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

పాలకుడు పాలన పట్ల ఎంత నిబద్ధతతో ఉన్నాడన్నదే లెక్కగాని, ఎన్నిసార్లు బటన్ నొక్కాం, ఎన్ని కోట్లు పంచామన్నది పట్టించుకోమని మొన్నటి ఎన్నికల్లో ప్రజలు నిరూపించారు. తన నియోజకవర్గంలో జరుగుతున్న ప్రతీ చిన్న విషయం పట్టించుకుంటారని ఈసారి గొండు శంకర్‌ను గెలిపించుకున్నారు. ఆయన కూడా ఇప్పటి వరకు ప్రజల ఆకాంక్షలకు దూరంగా జరగలేదు. నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని మురికి కాలువల్లోను సిల్ట్ తీయిస్తున్నారు. ఇది గతంలో ఎన్నడూ జరగనంత పెద్ద స్థాయిలో జరుగుతుంది. కాలువల నుంచి తీసిన సిల్ట్ ఎండేవరకు కాలువ పక్కనే ఉంచుతారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి కాలువల్లో ఉండాల్సిన చెత్త రోడ్డుపైకి రావడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాట్సాప్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ వెంటనే రోడ్డుపై ఉన్న మురుగును యుద్ధ ప్రాతిపదికన ఎత్తించారు. శుక్రవారం రాత్రి దీపామహల్ మెయిన్ రోడ్డు మీద అడుగుపెట్టే పరిస్థితి లేకపోగా శనివారం మధ్యాహ్నానికి అది క్లీన్ చేసేశారు.



శనివారం మధ్యాహ్నం

# 3న ఉమెన్స్ కాలేజ్‌లో జాబ్‌మేళా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో టెన్త్ నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా జాబ్‌మేళాను స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి.సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ మేళాలో 9 స్థానిక, బహుళజాతి కంపెనీలు పాల్గొని అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందన్నారు. ఈ ఉద్యోగమేళాలో 6కంపెనీలు కేవలం దివ్యాంగులైన అర్హత కలిగిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత విద్యార్హత పత్రాలు నకలు, సదరం సర్టిఫికెట్ (దివ్యాంగులకు), ఆధార్‌కార్డు జెరాక్స్, మూడు బయోడేటా పత్రాలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో హాజరుకావాలని, వివరాలకు 95509 67353, 83176 52552 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు.



స్థానిక 16వ డివిజన్‌లో శనివారం వివిధ రకాల పింఛన్లను ఆ డివిజన్ ఇన్‌చార్జ్ ఎస్వీ రమణమాదిగ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.
**- సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్**



నేషనల్ స్పోర్ట్స్ సందర్భంగా జిల్లాలో శనివారం 3×3 బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన వారికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే గొండు శంకర్, బాస్కెట్‌బాల్ చైర్మన్ ఎమ్మెస్సార్, కోచ్ అర్జున్‌రెడ్డిలు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మరిన్ని ఈ క్రీడాకారులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

# సామాజిక భద్రత ఫించన్లు పంపిణీ ప్రభుత్వ బాధ్యత



**-మూలపేట నుండి విశాఖపట్నం వరకు తీరప్రాంతం అభివృద్ధి**
**- ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలు త్వరలో జారీ**
**- రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సామాజిక భద్రత ఫించన్లు పంపిణీ ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, మత్స్య, పశు సంవర్ధక, డెయిరీ అభివృద్ధి శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. శనివారం టెక్కలి మండలం రావివలసలో ఏర్పాటు చేసిన సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సామాజిక బాధ్యత పింఛన్లు, ప్రభుత్వ భవనాలు ప్రారంభించినట్లు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నంగా ఉందన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియజేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసి 90 రోజులు అవుతుందని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఒక్కొక్క హామీ నెరవేరుస్తున్నామన్నారు. జూలైలో 7 వేలు, ఆగస్టు నెలలో 4 వేలు చొప్పున పింఛన్లు అందజేశామన్నారు. వాలంటీర్లు కంటే ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. 1వ తేదీ ఆదివారం వచ్చినందు వలన అధికారులకు ఇబ్బంది లేకుండా ముందురోజే ఫించన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫించన్లు వస్తాయని ఆత్మ విశ్వాసంతో అందరూ ఎదురు చూస్తారన్నారు. సామాజిక భద్రత ఫించన్లు పంపిణీ ప్రభుత్వ బాధ్యతన్నారు. అర్హత గల వికలాంగులకు ఫించన్లు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. టెక్కలి నుండి రావివలసకు వచ్చే రహదారిని మంజూరు చేస్తామన్నారు. త్వరలోనే శంకుస్థాపన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఎండలమల్లిఖార్జున స్వామి ఆలయానికి ఇప్పటికే గతంలో కొన్ని నిధులు మంజూరు చేయడమైనదని, దేవాదాయ శాఖ అధికారులను తీసుకువచ్చి వారితో చర్చించి ఆలయం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధిహామీ నిధుల నుండి కాలనీ వాసులకు రూ.140కోట్లుతో మిగిలి ఉన్న సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తామని వివరించారు. సెప్టెంబర్‌లో నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయని, గొడవలు పడకుండా రైతులంతా సమన్వయంతో కాలువ బాగు చేసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నిదులు మంజూరు చేసిందన్నారు. మూలపేట పోర్టు శరవేగంగా పూర్తి చేస్తామని చెప్పారు. మూలపేట నుండి విశాఖపట్నం వరకు తీర ప్రాంతం అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అన్న కేంటీన్‌లు కోటబొమ్మాళి, టెక్కలిలో తన సొంత నిధులతో ప్రారంభించినట్లు చెప్పారు. ప్రభుత్వ రాజముద్రతో పాసు పుస్తకాలు జారీ చేస్తామన్నారు. నిర్మించిన గృహాలకు సంబంధించి బిల్లులు అవ్వకపోతే అప్‌లోడ్ చేయాలని చెప్పారు. సమర్థవంతమైన నాయకుడైన చంద్రబాబు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పెడుతున్నారన్నారు. తప్పుచేసిన వారు ఎవరైనా శిక్ష అనుభవించక తప్పదని స్పష్టం చేశారు. అవినీతి లేకుండా ధర్మం, న్యాయంతో పారదర్శక పాలన అందించాలని చెప్పారు. ప్రతీ ఒక్కరూ మెచ్చుకొనే విధంగా పాలన ఉంటుందన్నారు. గ్రామప్రజలు చూపిన ప్రేమానురాగాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మీ సేవకుడుగా, మంచితత్వంతోనే నాయకులౌతారని చెప్పారు. తనను కలిసేందుకు వచ్చేవారు బొకేలు, శాలువాలు తీసుకురావద్దని, అవి తెచ్చే బదులు మొక్కలు తీసుకువస్తే పర్యావరణానికి ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. రూ.77.30లక్షలతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్‌క్లినిక్, గ్రామ సచివాలయ భవనాలను ఆయన ప్రారంభించారు. గ్రామ సచివాలయ భవనం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. మాజీ జడ్పీటీసీ కెవెల్ నాయుడు మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, గృహాలు లేనివారికి గృహాలు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసువచ్చారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో సుదర్శన్‌దొర, ఇన్‌చార్జ్ డిపిఓ ఆర్.వెంకట్ రామన్, తహసీల్దార్ దిలీప్ చక్రవర్తి, టెక్కలి ఎంపిపి ఎ.సరోజనమ్మ, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వరప్రసాద్, మాజీ ఎంపీపీ సుందరమ్మ, పశు సంవర్ధక శాఖ జేడీ జయరాజు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




సంచారజాతుల విముక్తి దివాస్ సందర్భంగా స్థానిక ఏడురోడ్ల కూడలి సమీపంలో నివసిస్తున్న సంచారజాతులకు బీజేపీ నాయకులు శనివారం పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కొంతమంది సంచారజాతుల వారిని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.సురేష్‌బాబుసింగ్, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పి.సూర్యకుమారి, పి.సంజీవరావు, పి.శ్రీనివాసరావు, జి.రాజు, పట్నాయక్, వెంకటరావు, రమణలు పాల్గొన్నారు.
**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## విద్యార్థినుల వీడియోలు తీసినవారిని శిక్షించాలి

(సత్యంన్యూస్, పలాస)

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినుల వసతి గృహంలో రహస్యంగా కెమెరాలు పెట్టిన ఘటనలో నిందితుల్ని కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ డిమాండ్ చేశారు. బొడ్డపాడు పీవోడబ్ల్యూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కళాశాల వసతి గృహంలో రహస్యంగా హిడెన్ కెమెరాలతో అసభ్యకరంగా వ్యవహరించిన ఘటన అత్యంత దుర్మార్గమన్నారు. లక్షలాది రూపాయలు ఫీజులు దండుకుంటున్న యాజమాన్యం వసతి గృహల్లో సరైన పర్యవేక్షణ చేయడం లేదని, ముందస్తు సమాచారం ఉన్నా యాజమాన్యం స్పందించలేదని, యజమాన్యంపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటమాడుతున్న నిందితుల్ని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రతిక్షల మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు కుత్తుం హేమక్క, బర్ల జానకమ్మ పాల్గొన్నారు.



# చాపురంలో పింఛన్ల పంపిణీ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

చాపురం విలీన గ్రామ పంచాయతీ గ్రామాల్లో శ్రీకాకుళం రూరల్ మండలం క్లస్టర్ ఇన్‌ఛార్జీ అల్లు నరసయ్య, మాజీ ఎంపీటీసీ మట్ట ఆనంద్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు డొంక శోభనబాబు, అల్లు లక్ష్మణ, తంగి గోపి, వై.చెల్లయ్య, అల్లు వెంకటరమణ, మట్ట రమేష్, మట్ట పాపారావు, పల్ల వెంకటరమణ, అల్లు శ్రీరాములు, పల్లి శేఖర్, అల్లు అప్పలనాయుడు, యాగటి సూరి, డొంక నవీన్, ఎస్.బాలకృష్ణ, తిప్పాన సంతోష్, నక్క ధర్మారావు, మరదన సురేష్, అల్లు శ్రీవిద్య, జడా రాము, దుంగా జగన్నాథం, అల్లు బాలాజీ, అల్లు ఢిల్లీ, అంపోలు శ్యాము, అరసవల్లి శివగిరి తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.